సాక్షి నల్లగొండ

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



ఉపాధి దూరమై.. బతుకు భారమైంది - 10లో

యాదాద్రి కొండపైకి ఆటోలను అనుమతించకపోవడంతో ఉపాధి కోల్పోయామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. 'సాక్షి' నిర్వహించిన పీపుల్స్ ఎజెండాలో వారు సమస్యలు ఏకరువు పెట్టారు.



ఓర్వలేకనే ఫిర్యాదు

పథకాలు చూసి ఓర్వలేకే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టౌన్: 2023–24 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని పారామెడికల్ ప్రైవేట్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎంపీహెచ్‌ఏ(ఎం), డీఎంఎల్‌టీ, డీఓఏ, డీఏఎన్‌ఎస్, డీఎంఐటీ, డీఆర్‌జీఏ, డీఓఎం, డీఈసీజీ, డయాలసిస్, టీసీఎల్‌టీ, డీఏఎం కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ఐజీని కలిసిన కలెక్టర్



ఐజీకి మొక్క అందజేస్తున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ, నకిరేకల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు వచ్చిన ఐజీ షానవాజ్ ఖాసీంను గురువారం జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఐజీ షానవాజ్.. ఎస్పీ అపూర్వరావుతో కలిసి నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని అన్ని గదులు, రికార్డులను పరిశీలించారు. శాంతి భద్రతలు, ఇతర అంశాలపై సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు సుధీర్, గోపికృష్ణ తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం అల్పాహారం అందించాలి




బ్రేక్‌ఫాస్ట్ వడ్డిస్తున్న డీఈఓ భిక్షపతి

నకిరేకల్, కట్టంగూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నవిద్యార్థులందరికీ మెనూ ప్రకారం అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి ఆదేశించారు. నకిరేకల్‌లోని బాలికల ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న అల్పాహారం పంపిణీని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డీఈఓ స్వయంగా బ్రేక్‌ఫాస్ట్ వడ్డించి మాట్లాడారు. అనంతరం కట్టంగూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సమగ్ర వివరాల నమోదు చేపట్టిన ఆన్‌లైన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ నాగయ్య, పాఠశాలల సిబ్బంది శ్యాం, అంబటి అంజయ్య, ఆర్.జ్యోతి తదితరులు ఉన్నారు.

లైగింక వేధింపుల ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

దేవరకొండ: హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగింక వేధింపుల ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం దేవరకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా ఐద్వా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, భూతం అనురాధ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కంబాలపల్లి ఆనంద్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు మిల్లర్లు సహకరించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: వానాకాలం 2023–24 సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లకు మిల్లర్లు సహకరించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ కోరారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారులు, మిల్లర్ల సమన్వయ సమావేశంలో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు గన్నీబ్యాగులు పంపిస్తున్నామని తెలిపారు. ధాన్యం 17 శాతం తేమ వచ్చేలా ఆరబెట్టాలని రైతులకు సూచించారు. సమావేశంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వరరావు, డీఏఓ శ్రావణ్, డీసీఓ కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ కాళిందిని, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.





ప్రజా ఆశీర్వాద సభలో నినాదాలు చేస్తున్న మహిళలు, సభా వేదికపై నుంచి అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

నీళ్ల గోస తీర్చినం

ఫ్లోరైడ్ మహమ్మారిని తరిమికొట్టినం

- కరువు ప్రాంత వాసుల సాగునీటి కల త్వరలో నెరవేరుతుంది
- బాధ్యత నాదని హామీ ఇస్తున్నా..
- ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన
- మునుగోడు ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం
- భారీగా హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు

మునుగోడు, చండూరు : 'పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే డిండి ప్రాజెక్టుకు, శివన్నగూడెంకు నీళ్లు వస్తాయి. ఆ ప్రాజెక్టు చివరి దశకు వచ్చింది. కరువు ప్రాంతం కాబట్టి మిగిలిన పనులన్నీ పూర్తి చేసే బాధ్యత నేను తీసుకుంటా. ఏడాదిన్నరలో మునుగోడు నియోజకవర్గంలోనే 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే బాధ్యత నాది' అని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మునుగోడులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం మాట్లాడారు. ఫ్లోరైడ్‌తో ఒకప్పుడు నల్లగొండ జిల్లా ప్రజలు గోస పడ్డారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఫ్లోరైడ్‌ను తరిమికొట్టి నీళ్ల గోస తీర్చామని చెప్పారు. వేదికపై నుంచి సీఎం తొమ్మిది నిమిషాలు మాత్రమే మాట్లాడినా.. ఎక్కువగా సాగు, తాగునీటి అంశాలనే ప్రస్తావించారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించే నక్కలగండి ప్రాజెక్టును పూర్తిచేస్తామన్నారు. ఈ ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలో నియోజకవర్గంలోని చర్లగూడెం, కిష్టరాంపల్లి రిజర్వాయర్లను పూర్తిచేసి 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.



వినూత్న వేషధారణలో బీఆర్‌ఎస్ కార్యకర్త

సాకారం దిశగా సాగునీటి కల..

సీఎం కేసీఆర్ ప్రసంగం మునుగోడు ప్రజల్లో నూతన ఉత్సాహం నింపింది. సాగునీటి కల నెరవేరనుందనే అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమైంది. గత ఏడాది ఉప ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో దాదపు 90 శాతం అమలు చేశామని, మిగిలిన పనులు త్వరలో చేస్తామని సీఎం చెప్పడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ఈలలు వేశారు. అభివృద్ధి పనులపై కొత్త హామీలు ఇవ్వకపోయినా.. ప్రధానంగా సాగు నీటి అంశంపై సీఎం మాట్లాడడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సభ విజయవంతం

మునుగోడులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. దాదాపు పది ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సభా స్థలం జనంతో నిండిపోయింది. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఊహించిన దానికంటే అధికంగా జనం తరలివచ్చారు. సీఎం సభా వేదికపైకి ఆలస్యంగా వచ్చినప్పటికీ ఆయన రాక కోసం వేచి ఉండి ప్రసంగం విన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల ప్రజలు మధ్యాహ్నం 2 గంటల నుంచే సభా స్థలానికి చేరుకున్నారు. మునుగోడు అంతా గులాబీ మయమైంది.



సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మునుగోడు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

అలరించిన ఆటాపాటలు

సభలో కళాకారుడు మిట్టపల్లి సురేందర్ కళాబృందం పాడిన పాటలు అందరినీ అలరించాయి. కళాకారులు పాటలు పాడుతున్న సమయంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆయన భార్య అరుణ, మహిళా జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్‌లు వేదికపై నృత్యాలు చేశారు. సభలో మంత్రులు జగదీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, గీత కార్మిక కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, యాదాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, నాయకులు మునగాల నారాయణరావు, జెల్లా మార్కండేయులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి



తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సాగునీటి వనరులు పెంచి నేడు అన్నపూర్ణగా మార్చారనిఅన్నారు. అత్యధింగా ఫ్లోరోసిస్ ఉన్న మునుగోడులో ఆ సమస్యను తీర్చేందుకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించారన్నారు. రానున్న రోజుల్లో చర్లగూడెం, కిష్టరాయినిపల్లి రిజర్వాయర్లను పూర్తిచేస్తామన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

మునుగోడు అభివృద్ధికి నిరంతరం పనిచేస్తా



తుదిశ్వాస వరకు తాను మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఉద్యమకాలంలో ఈ ప్రాంతంలో ఫ్లోరోసిస్ సమస్యను గుర్తించిన కేసీఆర్ దానిని రూపుమాపేందుకు మొట్ట మొదటిగా మిషన్ భగీరథ పథకాన్ని మునుగోడు నియోజకవర్గంలో ప్రారంభించారన్నారు. నక్కలగండి నుంచి సాగు నీరు అందించేందుకు మర్రిగూడ, నాంపల్లి మండలాల్లో చెర్లగూడెం, కిష్టరాయినిపల్లి రిజర్వాయర్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. కానీ, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఓర్వలేక కోర్టులో కేసులు వేయడంతో ఆ పనులు పూర్తి కాలేదన్నారు. ఈ ఎన్నికల అనంతరం ఆ పనులు ప్రారంభించి ఏడాదిలోపు పూర్తి చేయించి రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు. పూటకో పార్టీ మారే నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు

సీఎం సభకు పలువురు నేతలు గైర్హాజరు

- ఎమ్మెల్యే నుంచి సమాచారం లేనందునే రాలేదని వెల్లడి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మునుగోడులో గురువారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు పలువురు అసంతృప్త నేతలు, ప్రజాప్రతినిధులు హాజరు కాలేదు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నుంచి తమకు సమాచారం లేనందునే హాజరు కాలేదని పేర్కొన్నారు. వారిలో ఎక్కువ మంది ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన వారే. ఈ ఎన్నికల్లో తాము సహకరించబోమని ముఖ్య నేతలకు వారంతా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే తమను పట్టించుకోలేదని, దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాల్లో ప్రాధాన్యం కల్పించలేదని పేర్కొనట్లు సమాచారం.

హాజరుకాని నేతలు వీరే..


రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్స్ చైర్మన్, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కర్నాటి విద్యాసాగర్, నారబోయిన రవి, వేనేపల్లి వెంకటేశ్వర్‌రావు, మునుగోడు జెడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణి, నాంపల్లి జెడ్పీటీసీ సభ్యుడు ఎలుగోటి వెంకటేశ్వరరెడ్డి, నారాయణపురం ఎంపీపీ గుత్త ఉమాప్రేమ్‌చందర్‌రెడ్డి, మునుగోడు వైస్ ఎంపీపీ అనంత వీణ లింగస్వామిగౌడ్, నాంపల్లి వైస్ ఎంపీపీ పానుగంటి రజిని వెంకన్నగౌడ్, నారాయణపురం సర్పంచ్ సికిలంమెట్ల శ్రీహరి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ బోల్ల శివశంకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లల మర్రి శ్రీనివాస్ తదితర నాయకులు హాజరుకాలేదు.

రోడ్డు మార్గంలో వెళ్లిన సీఎం



చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం : మునుగోడులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న సీఎం కేసీఆర్ సభ అనంతరం రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. సీఎం కాన్వాయ్ మునుగోడు నుంచి నారాయణపురం, చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లింది. నారాయణపురం, చౌటుప్పల్‌తో పాటు పలు గ్రామాల కూడళ్ల వద్ద ప్రజలకు సీఎం కేసీఆర్ అభివాదం చేశారు. సీఎంను చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరిచారు. పోలీసులు అన్ని గ్రామాలు, కూడళ్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో సీఎం కాన్వాయ్ వెళ్లేంత వరకు తంగడపల్లి చౌరస్తా, ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద జంక్షన్‌లను మూసివేశారు. హైదరాబాద్ రూట్‌లో వాహనాలను నిలిపివేశారు.

నేడు సూర్యాపేటలో జనగర్జన





సూర్యాపేటలో జనగర్జన సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, సంకినేని వెంకటేశ్వరరావు

పాల్గొననున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

- ఏర్పాట్లు పూర్తిచేసిన బీజేపీ శ్రేణులు
- లక్ష మందిని తరలించేలా ప్రణాళిక

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించే బీజేపీ జనగర్జన సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక వ్యవసాయ మార్కెట్ సమీపంలో నిర్వహించనున్న ఈ సభలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పాల్గొననున్నారు. అమిత్‌షా మధ్యాహ్నం 3గంటల 45 నిమిషాలకు సూర్యాపేటకు చేరుకుంటారు. 4గంటల నుంచి 5గంటల వరకు సభలో పాల్గొంటారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి సుమారు లక్ష మందిని తరలించేలా పార్టీ నేతలు ప్రణాళిక రూపొందించుకున్నారు. కాగా సభ ఏర్పాట్లను గురువారం గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరావుతో కలిసి పరిశీలించారు.

ఓట్ల ద్వారా లబ్ధి పొందేందుకే కొత్త పథకాలు : ఎమ్మెల్యే రాజాసింగ్

ఎన్నికల్లో ఓట్ల ద్వారా లబ్ధి పొందేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త కొత్త పథకాలు తీసుకొస్తోందని ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు. సూర్యాపేటలో మీడియాతో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేరుకే కొద్ది మందికి ఆశ చూపి దశల వారీగా అందరికీ ఇస్తామని, ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చిందని తప్పించుకుందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని, బంగారు తెలంగాణ స్థానంలో అప్పుల తెలంగాణ , మద్యం తెలంగాణగా మార్చారని ధ్వజమెత్తారు. కేంద్రం సహాయంతోనే సూర్యాపేట జిల్లాలో, రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని స్పష్టం చేశారు. ఒక్క చోట ప్రభుత్వం ఉంటేనే ఇలా అభివృద్ధి జరిగితే అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ రెండు చోట్ల బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే మరింత అభివృద్ధి జరగడానికి ఆస్కారం ఉంటుందన్నారు. సూర్యాపేటలో జరిగే జనగర్జన సభను లక్షమందితో విజయవంతం చేస్తామన్నారు. అమిత్ షా ఇచ్చే సందేశం కోసం ప్రజలు, కార్యకర్తలు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఆలోచించి ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇచ్చి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ బాగ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ క్యాడర్‌కు చైతన్యరెడ్డి

- ఐపీఎస్ ట్రైనింగ్ పూర్తి

నూతనకల్: నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన బొక్క చైతన్యరెడ్డి తెలంగాణ క్యాడర్‌కు ఎంపికయ్యారు. బొక్క సంజీవరెడ్డి -వినోద దంపతుల కుమార్తె చైతన్యరెడ్డి 2022లో ప్రకటించిన యూపీఎస్సీ పరీక్షలో 161ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన విషయం విదితమే. హైదరాబాద్‌లో ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. తండ్రి జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్‌గా వరంగల్‌లో పనిచేస్తుండడంతో అక్కడే స్థిరపడ్డారు. చైతన్యరెడ్డి వరంగల్‌లోని ఎన్ఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. నీటిపారుదల శాఖలో ఏఈగా విధులు నిర్వహిస్తూనే సివిల్స్ వైపు దృష్టిసారించారు. ఆరు సార్లు ప్రయత్నించి విఫలమైనా పట్టువదల కుండా ఆత్మవిశ్వాసంతో ఏడో ప్రయత్నంలో అనుకున్న లక్ష్యం సాధించారు.



చైతన్యరెడ్డి

సొంతరాష్ట్రం క్యాడర్‌కు ఎంపిక కావడం సంతోషం

సొంత రాష్ట్రం క్యాడర్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉందని చైతన్యరెడ్డి అన్నారు. స్వరాష్ట్ర ప్రజలకు సేవలు అందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కర్ణన్

నల్లగొండ: నల్లగొండ: ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సభ్యులు అప్రమత్తంగా ఉంటూ.. ప్రతి ప్రకటనను నిశితంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన అధ్యక్షతన జరిగిన ఎంసీఎంసీ జిల్లాస్థాయి సమావేశంలో కమిటీ పనితీరుపై చర్చించారు. ఇప్పటివరకు ఎన్నికల ప్రచారం నిమిత్తం వచ్చిన దరఖాస్తులు, వాటిని పరిశీలించిన విధానం, జారీ చేసిన అనుమతులు తదితర అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రోజూ క్రమం తప్పకుండా పెయిడ్ న్యూస్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే ఎన్నికల ప్రచార ప్రకటనలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అభ్యంతరకర వీడియోలు, సందేశాలు తదితర వాటిపై చర్చించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారం కోసం వచ్చే దరఖాస్తులకు సంబంధించిన అంశాలు, వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి అభ్యంతరం లేని వాటికే అనుమతులు మంజూరు చేయాలన్నారు. అన్ని ప్రధాన దిన పత్రికలను రోజూ పరిశీలిస్తూ ఎన్నికల ప్రచార ప్రకటనలు, పెయిడ్ న్యూస్, ఎన్నికల ప్రవర్తన నియమావళికి భిన్నంగా అభ్యంతరంగా ఉండే అంశాలతో కూడిన న్యూస్ గుర్తించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎన్నికలతో ముడిపడిన అంశాలను అనునిత్యం పరిశీలన జరపాలని, అవసరమైన వాటిని తగిన రీతిలో రికార్డు చేయాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

విధులు సక్రమంగా నిర్వహించాలి

ఎన్నికలల్లో నోడల్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కర్ణన్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఓ, ఏపీఓలకు శుక్ర, శనివారాల్లో నియోజకవర్గాల వారీగా ఎన్నికల విధులపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఎక్సైజ్ శాఖ అక్రమ మద్యం నిరోధానికి గట్టి చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులు మూసి వేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో కమిటీ సభ్యులు అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మీడియా నోడల్ అధికారి కోటేశ్వరరావు, డీపీఆర్‌ఓ పి.శ్రీనివాస్, జిల్లా సమాచార అధికారి గణపతి, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలి

మిర్యాలగూడ అర్బన్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించి, ప్రజా సమస్యలపై చట్టసభల్లో గళం వినిపించే వామపక్ష, ప్రజాతంత్ర వాదులను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మిర్యాలగూడలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశాయని ధ్వజమెత్తారు. ప్రజలను ప్రలోబాలకు గురి చేసి ఈ ఎన్నికల్లో ఓట్లు పొందాలని చూస్తున్న ఆ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పార్టీతో రాజకీయ అవగాహన కుదిరిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతం రెడ్డి, పాండు, పద్మ, రవినాయక్, వరలక్ష్మి, మంగారెడ్డి, రామ్మూర్తి, సత్యనారాయణరావు, వాడపల్లి రమేష్, రామచంద్రు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

బీఆర్‌ఎస్‌కు నకిరేకల్ ఎంపీపీ రాజీనామా

- కేటీఆర్‌కు లేఖ పంపిన శ్రీదేవిగంగాధర్‌రావు దంపతులు
- కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్టు సమాచారం

నకిరేకల్: అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు దంపతులు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా లేఖను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫ్యాక్స్ ద్వారా పంపామని గురువారం నకిరేకల్‌లో విలేకరులకు వెల్లడించారు. రాజీనామా లేఖలో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన బచ్చుపల్లి గంగాధర్‌రావు హైదరాబాద్‌లో బిల్డర్‌గా, రియల్టర్‌గా కొనసాగుతూ ప్రజాసేవ చేయాలనే ఆలోచనతో రాజకీయాల్లోకి వచ్చామని లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తన సతీమణి శ్రీదేవిని బీఆర్‌ఎస్ నుంచి మంగళపల్లి ఎంపీటీసీగా పోటీ చేసి గెలిచి ఎంపీపీగా ఎన్నికయ్యారన్నారు. నాటినుంచి బీజేఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. ప్రజల నుంచి మాకు వస్తున్న ఆదరణ చూసి స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఓర్వడం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే మూడున్నరేళ్లుగా అధికారిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా తమను ఆహ్వానించకుండా.. కనీసం ప్రొటోకాల్ పాటించకుండా మాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ వచ్చారన్నారు. మా అభిప్రాయాలను పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలను తీసుకున్నారని ఆరోపించారు. మా వెంట ఉన్న కార్యకర్తలపై కేసులు పెట్టించి వేధించారని, మహిళా ప్రజాప్రతినిధి అన్న గౌరవం లేకుండా అవమానపరిచారని పేర్కొన్నారు. మా ఆత్మాభిమానం చంపుకోలేక బీఆర్‌ఎస్‌లో కొనసాగలేక రాజీనామా చేస్తున్నామని లేఖలో వివరించారు.



ఎంపీపీ శ్రీదేవిగంగాధర్‌రావు దంపతులు

నేడు రాహుల్ సమక్షంలో హస్తం గూటికి!

బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన నకిరేకల్ ఎంపీపీ శ్రీదేవిగంగాధర్‌రావు దంపతులు శుక్రవారం ఢిల్లీలో రాహుల్‌గాంధీ సమక్షంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరితోపాటు నకిరేకల్ నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ మాజీ ప్రజాపతినిధులు, మరికొందరు నేతలు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం.


మునుగోడు ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి వేదికపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, యాదాద్రి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి తదితరులు


సభా వేదికపై నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి, మహిళా నాయకులు


మునుగోడు ప్రజా ఆశీర్వాద సభలో పాటలు పాడుతున్న కళాకారులు

సీఎం పర్యటన ఇలా..

- సాయంత్రం 5.52 గంటలకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్ సభ వద్దకు చేరుకుంది.
- 5.55 గంటలకు ప్రత్యేక బస్సులో సీఎం సభా వేదిక వద్దకు చేరుకున్నారు
- 5.58కి వేదికపైకి ఎక్కారు
- 6.01 గంటలకు సీఎం ప్రసంగం ప్రారంభమైంది
- 6.10కి సీఎం తన ప్రసంగాన్ని ముగించారు
- 6.13 గంటలకు ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌కు బయలుదేరారు. - మునుగోడు

సాగర్ రాజకీయం రసవత్తరం

- ఇక్కడి నుంచి ఏడుసార్లు గెలుపొందిన జానారెడ్డి
- 13 శాఖలకు మంత్రిగా పనిచేసిన రికార్డు
- 2018, 2021 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పాగా



అసెంబ్లీ ఫ్లాష్‌బ్యాక్

హాలియా : ప్రపంచ పర్యాటక కేంద్రంగా పేరొందిన నాగార్జునసాగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా ఏడు పర్యాయాలు విజయం సాధించిన కుందూరు జానారెడ్డి సుదీర్ఘ కాలం మంత్రిగా పనిచేసి రికార్డు సృష్టించారు. ఎన్టీఆర్ మంత్రి వర్గంలో 1983, 1985లో కుందూరు జానారెడ్డి 13 శాఖలకు మంత్రిగా పని చేశారు. నిమ్మల రాములు మూడుసార్లు గెలుపొందారు. తొలుత పెద్దవూర కేంద్రంగా ఉన్న ఈ నియోజకవర్గం.. తర్వాత చలకుర్తి కేంద్రంగా.. 2009లో నాగార్జునసాగర్ కేంద్రంగా నియోజకవర్గం ఏర్పడింది. నియోజకవర్గంలో అనుముల, నిడమనూరు, త్రిపురారం, పెద్దవూర, గుర్రంపోడు, తిరుమలగిరి మండలాలు ఉన్నాయి.


నిమ్మల రాములు


కుందూరు జానారెడ్డి


గుండెబోయిన రామ్మూర్తియాదవ్


నోముల నర్సింహయ్య


నోముల భగత్

సగమే సాగర్ ఆయకట్టు..

నాగార్జునసాగర్ నియోజకవర్గం వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఈ ప్రాంతంలోని 80శాతం మంది ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో అనుముల, నిడమనూరు, త్రిపురారం మండలాల గుండా సాగర్ ఎడమ కాల్వ ప్రవహిస్తుంది. కానీ సగమే ఆయకట్టు కాగా మిగిలిన ప్రాంతం నాన్‌ఆయకట్టు. ఆయకట్టు ప్రాంతంలో రైతులు వరి సాగు చేస్తుండగా, నాన్ ఆయకట్టులో రైతులు మెట్ట పంటలను పండిస్తున్నారు. గుర్రంపోడు, పెద్దవూర మండలాల్లో కొంత వరకు ఎస్‌ఎల్‌బీసీ ద్వారా సాగునీరందుతుంది.

కాంగ్రెస్ ఆధిపత్యం

సాగర్ నియోజకవర్గంలో గతంలో కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగింది. 1962 ఎన్నికల్లో సీపీఐ గెలు పొందగా, 1967లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన నిమ్మల రాములు గెలుపొందారు. ఆ తరువాత నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఏడు సార్లు గెలుపొందగా, టీడీపీ అభ్యర్థులు మూడు సార్లు గెలుపొందారు. టీఆర్‌ఎస్ నుంచి నోముల నర్సింహయ్య, నోముల భగత్ చెరోసారి విజయం సాధించారు.

నాగార్జున సాగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు వీరే..

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1962	పి.పర్వతరెడ్డి	సీపీఐ	జి.ఎన్.రెడ్డి	కాంగ్రెస్
1967	నిమ్మల రాములు	ఇండిపెండెంట్	ఎం.ఆదిరెడ్డి	సీపీఎం
1972	నిమ్మల రాములు	కాంగ్రెస్	ఎం.ఆదిరెడ్డి	ఇండిపెండెంట్
1978	నిమ్మల రాములు	కాంగ్రెస్	కె.జానారెడ్డి	జనతా
1983	కుందూరు జానారెడ్డి	టీడీపీ	నిమ్మల రాములు	కాంగ్రెస్
1985	కుందూరు జానారెడ్డి	టీడీపీ	రాగ్యానాయక్	కాంగ్రెస్
1989	కుందూరు జానారెడ్డి	కాంగ్రెస్	గోపగాని పెద్దనర్సయ్య	టీడీపీ
1994	జి.రామ్మూర్తియాదవ్	టీడీపీ	కె.జానారెడ్డి	కాంగ్రెస్
1999	కుందూరు జానారెడ్డి	కాంగ్రెస్	రామ్మూర్తియాదవ్	టీడీపీ
2004	కుందూరు జానారెడ్డి	కాంగ్రెస్	రామ్మూర్తియాదవ్	టీడీపీ
2009	కుందూరు జానారెడ్డి	కాంగ్రెస్	తేరా చిన్నపరెడ్డి	టీడీపీ
2014	కుందూరు జానారెడ్డి	కాంగ్రెస్	నోముల నర్సింహయ్య	టీఆర్‌ఎస్
2018	నోముల నర్సింహయ్య	టీఆర్‌ఎస్	కుందూరు జానారెడ్డి	కాంగ్రెస్
2021(ఉప)	నోముల భగత్	టీఆర్‌ఎస్	కుందూరు జానారెడ్డి	కాంగ్రెస్

జంగ్ తెలంగాణ

పీపుల్స్ ఎజెండా

ఉపాధి దూరమై.. బతుకు భారమైంది


యాదగిరిగుట్టలో పాత హైస్కూల్ గ్రౌండ్ లో ఆగిఉన్న ఆటోలు, డ్రైవర్లు

- యాదాద్రి కొండపైకి ఆటోలు నడవక రోడ్డున పడ్డాం
- బంగారం కుదువపెట్టి ఆటోలు కొన్నాం
- ఫైనాన్స్ కిస్తీలు కట్టడం కూడా కష్టమైతుంది
- కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నాం
- ప్రభుత్వం మాపై దయ చూపాలి
- ప్రభుత్వ పథకాలు అందజేసి ఆదుకోవాలి
- ఆటో కార్మికులకు ఉపాధి దొరికేలా చూడాలి

'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో ఆటో కార్మికుల ఆవేదన

రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు.. రోజూ సంపాదించిన డబ్బులతోనే కుటుంబం గడిచేది. 30 ఏళ్లకు పైగా బతుకుదెరువు కోసం ఆటోలను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న వారు నేడు రోడ్డునపడ్డారు. యాదాద్రి కొండపైకి వెళ్లనివ్వకపోవడంతో ఇప్పుడు ఉపాధి కోల్పోయి బతుకు భారంగా మారింది. 'పీపుల్స్ ఎజెండా'లో భాగంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట పట్టణంలో ఆటో కార్మికులను 'సాక్షి' పలకరించగా.. వారు తమ ఆవేదనను వెలిబుచ్చారు. - యాదగిరిగుట్ట



యాదగిరిగుట్ట కొండ పైకి 1990లో పది ఆటోలు నడిచేవి.. ఇప్పుడు వాటి సంఖ్య 296 చేరుకుంది. ఈ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు లేకపోవడంతో చదువుకున్న వారు సైతం ఆటోలు నడిపుతూ జీవనం సాగించే వారు. కుటుంబ సభ్యుల బంగారం తాకట్టు పెట్టి, ఫైనాన్స్‌లో అప్పులు తీసుకుని ఆటోలు కొనుగోలు చేశారు. కొండపైకి ఆటోలు నడిపిన సమయంలో వారికి ఉపాధి దొరికేది. యాదాద్రి ఆలయం అభివృద్ధి కావడంతో తమ బతుకులు బాగుపడతాయని వారంతా భావించారు. కానీ కొండపైకి ఆటోలను నిషేధించడంతో వారంతా ఉపాధి కోల్పోయారు. కనీసం వ్యవసాయం చేసి బతుకుదాం అంటే.. యాదాద్రి ఆలయ అభివృద్ధిలో భాగంగా కొంత మంది ఆటో డ్రైవర్ల భూములు పోయాయి. దీంతో వారు అటు ఆటో నడవక.. ఇటు వ్యవసాయం లేక కష్టాల్లో కూరుకుపోయారు. కుటుంబ పోషణ భారంగా మారడం.. ఆటోల కోసం తెచ్చిన అప్పులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వం ఆటోలను కొండపైకి అనుమతిస్తే.. తమ బతుకులు మారుతాయని ఆటో కార్మికులు ఎదురుచూస్తున్నారు.

భూములు కూడా పోయాయి..



యాదాద్రి అభివృద్ధిలో భాగంగా కల్యాణకట్ట మండపం నిర్మాణం కోసం నాది ఎకరం భూమి పోయింది. అయినా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిద్దాం అనుకున్నా. ఇప్పుడు ఆటోలు కొండపైకి నడవకపోవడంతో అటు వ్యవసాయం.. ఇటు ఉపాధి రెండూ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. కుటుంబ పోషణ భారమై ఇబ్బంది పడుతున్నా. ప్రభుత్వం కొండపైకి ఆటోలను అనుమతించాలి.
- ఆవుల సత్యనారాయణ

పట్టణ బస్టాండ్‌లోనే బస్సులు నిలపాలి



పట్టణ బస్టాండ్ నుంచి ఆలయ బస్టాండ్‌కు నేరుగా బస్సులను ఏర్పాటు చేశారు. కొండపైకి ఆటోలను అనుమతి ఇవ్వని సమయంలో పట్టణంలోని బస్టాండ్ వద్ద బస్సులు నిలపాలి. దీంతో ఆటోల్లో భక్తులను తులసీ కాటేజీ, కల్యాణకట్ట, అన్నదాన భవనం, ప్రెసిడెన్షియల్ సూట్, వ్రత మండపాల వద్దకు తీసుకెళ్తాం. దీనివల్ల ఆటో కార్మికులకు జీవనోపాధి లభిస్తుంది. ఈ అంశంపై ప్రభుత్వం, దేవస్థానం ఆలోచించాలి.
- మన్సూర్‌పాషా

ఆటోలను అనుమతించాలి



ఇక్కడ పరిశ్రమలు లేకపోవడంతో చాలా మంది యువకులు ఉపాధి లేక ఆటోలు నడుపుతున్నారు. కానీ యాదాద్రి ప్రధానాలయం ఉద్ఘాటన తరువాత ఆటోలు కొండపైకి నడకపోవడంతో చదువుకున్న యువకులంతా ఉపాధి లేక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం, కొత్తగా ఏర్పడే ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకునేందుకు యాదాద్రి కొండపైకి ఆటోలను నడిపిచేలా చర్యలు తీసుకోవాలి.
- కె.బాలరాజు

ఆటో కార్మికులకు జీవనోపాధి కల్పించాలి



యాదగిరిగుట్టలో ఆటో కార్మికులందరికీ ప్రభుత్వం జీవోనోపాధిని కల్పించాలి. అంతే కాకుండా ఆటో డ్రైవర్లందరికీ గృహలక్ష్మి, దళిత బంధు, బీసీ బంధు వంటి పథకాల్లో లబ్ధి చేకూర్చాలి. మా కుటుంబంలో చదువుకున్న పిల్లలకు యాదాద్రి దేవస్థానంలో ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలి.
- బాకి మొగులయ్య

నెలకు రూ.9వేల ఫైనాన్స్ కడుతున్నా..



నేను ముప్పై ఏళ్లుగా యాదాద్రి కొండపైకి ఆటో నడుపుతున్నా. యాదాద్రి ప్రధానాలయం ప్రారంభం అయితే మరింత ఉపాధి దొరికి కుటుంబ పోషణ బాగుంటుందని సంతోషించాం. కానీ 592రోజులకు పైగా ఆటోలు కొండపైకి నడవడం లేదు. దీంతో ఫైనాన్స్‌లో తీసుకువచ్చిన ఆటోకు ప్రతి నెల రూ.9 వేలు అప్పు చేసి కట్టాల్సి వస్తోంది.
- కర్రె బీరు మల్లయ్య

బంగారం తాకట్టుపెట్టి ఆటో కొన్నా..



మాది మాసాయిపేట. నేను ఏడేళ్లుగా ఆటోను నడిపిస్తున్నాను. ఆటో కొనుగోలుకు మా అమ్మ, భార్య బంగారం తాకట్టుపెట్టాను. మొదట్లో ఆటోలు కొండపైకి నడిచినా.. ఇప్పుడు బంద్ చేయడంతో జీవనోపాధి ఇబ్బందిగా మారింది. ప్రతి నెల రూ.5,500 ఫైనాన్స్ కట్టడానికి ఇబ్బంది పడుతున్నా. యాదగిరిగుట్ట నుంచి మాసాయిపేట, రాజాపేటకు ఆటో నడుపుకుందామంటే అక్కడి యూనియన్లు ఒప్పుకోవడం లేదు.
- పల్లెపాటి నర్సింహ

పుస్తె అమ్మి ఆటో తెచ్చా



నేను 2003 నుంచి యాదాద్రి కొండపైకి ఆటో నడిపిస్తున్నాను. అప్పట్లో రూ.500 వస్తే రూ.300 ఆటో యాజమానికి ఇచ్చి.. రూ.200 నేను తీసుకునే వాడిని. 2017లో నా భార్య మెడలో పుస్తెల తాడు కుదువపెట్టి సొంతంగా ఆటోను కొనుగోలు చేశా. కొండపైకి ఆటోలు బంద్ చేయడంతో తాకట్టుపెట్టిన పుస్తెల తాడు అలాగే ఉంది. కొండపైకి ఆటోలను అనుమతిస్తే మా బతుకులు బాగుపడుతాయి.
- గుండ్లపల్లి బంగారి

కొండపైకి ఆటోలు నడిపించాలి



యాదాద్రి ఆలయం ప్రారంభం నాటి నుంచి మా ఆటోలను కొండపైకి బంద్ చేశారు. దీంతో ఆటో కార్మికులు రోడ్డున పడ్డారు. ప్రస్తుతం ఉన్న 296 ఆటోలను నాలుగు భాగాలుగా విభజించి రోజుకు 70 ఆటోలను కొండపైకి అనుమతించాలి. దీంతో భక్తులకు ప్రయాణ సేవలు అందించడంతో పాటు కొండపైన ఇబ్బందులు తలెత్తవు. - గడ్డమీది దేవేందర్‌గౌడ్

ఓటు హక్కుపై అవగాహన


సీ విజల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్స్ చూపిస్తున్న మహిళలు

త్రిపురారం : త్రిపురారం మండల కేంద్రంలోని శ్రీశక్తి భవన్‌లో బీఎల్‌ఓలు, మహిళా సంఘాల సభ్యులకు 'నైతిక ఓటరుగా ఉందాం – ప్రజాసామ్య స్ఫూర్తిని నింపుదాం' అనే నినాదంతో నూతన ఓటర్ల నమోదు, ఓటు వినియోగం, సీ విజిల్ యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎం అరుణ్ కుమార్, ఏపీఎం అశోక్ కుమార్, ఆర్‌ఐ సైదులు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

వీరిచే ఓటు వేయిస్తే శిక్షార్హులు

చిట్యాల: పద్దెనిమిదేళ్లు నిండి ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారంతా అన్నిరకాల ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. కానీ మానసికస్థితి సరిగా లేని వారు, మతిస్థిమితం లేని వారు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అనర్హులు. అలాంటి వారు ఓటు హక్కు కల్గి ఉన్నప్పటికీ వారి చేత సహాయకులు ఓటు వేయిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం శిక్షార్హులు అవుతారు.

రూ.1.30లక్షల నగదు, లిక్కర్ సీజ్

నల్లగొండ: ఎన్నికల తనిఖీల్లో భాగంగా గురువారం నల్లగొండ జిల్లాలో పోలీసులు రూ.1,30,500 నగదుతో పాటు రూ.3,197 విలువ చేసే లిక్కర్‌ను సీజ్ చేశారు. 13 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ నెల 12 నుంచి ఇప్పటి వరకు సీజ్ చేసిన రూ.5,97,58,860 నగదును రిలీజ్ చేశారు.

ప్రచారంలో చిన్నారులు

భువనగిరి మండలం బస్వాపురం గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో చిన్నారులు డప్పు కొడుతూ కనిపించారు. ప్రచారానికి వచ్చిన వారి తల్లిదండ్రులు కొద్దిసేపు విశ్రాంతి తీసుకోగా.. ఆ సమయంలో చిన్నారులు డప్పులు తీసుకొని వాయించారు.
- భువనగిరిటౌన్



రాజగోపాల్‌రెడ్డి పెద్ద మనసు చేసుకోవాలి


మాట్లాడుతున్న చలమల్ల కృష్ణారెడ్డి


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- మునుగోడు సీటును వదిలివేయాలి
- పీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి

చౌటుప్పల్: రాజకీయంగా ఇప్పటికే ఎన్నో పదవులు పొంది రాష్ట్రస్థాయి నేతగా గుర్తింపు పొందిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పెద్ద మనసుతో మునుగోడు అసెంబ్లీ సీటును తనకు వదిలివేయాలని పీసీసీ ప్రధాన ర్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. ఈ విషయంలో రాజగోపాల్‌రెడ్డి తనకు అండగా ఉంటారన్న నమ్మకం ఉందన్నారు. ఎన్నికల్లో రాజగోపాల్‌రెడ్డి సహకారం, వామపక్షాల మద్దతుతో తానే పోటీలో ఉండి విజయం సాధిస్తానని తెలిపారు. చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం మునుగోడు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలమల్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గతేడాది జరిగిన ఉప ఎన్నిక సమయంలోనే చివరి నిమిషంలో తనకు టికెట్ చేజారిందన్నారు. ఆ సమయంలోనే అధిష్టానం టికెట్ విషయంలో భరోసా ఇచ్చిందని గుర్తు చేశారు. మునుగోడులో పోటీ చేయాలని 2018 ఎన్నికల తర్వాత భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రోత్సహిస్తేనే ఇక్కడికి వచ్చానని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డే తన ధైర్యమన్నారు. గత ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన అభ్యర్థి కోసం తాను రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తే ప్రస్తుతం ఆ అభ్యర్థి తనకు టికెట్ దక్కకుండా ఢిల్లీలో పైరవీలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి రావడం సంతోషదాయకమేనని, ఇక్కడి నుంచి కాకుండా మరోచోట పోటీ చేయాలని కోరారు. ఎవరెన్ని చేసినా టికెట్ పొందేది తానేనని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, పాల్వాయి చెన్నారెడ్డి, ఎంఏ. గఫూర్, మాజీ ఎంపీపీ బుజ్జి, మండల అధ్యక్షులు బోయ దేవేందర్, కోడి గిరిబాబు, ఏపూరి సతీష్, ముద్దం నర్సింహ, సురిగి నర్సింహ, కొమ్ము భిక్షం, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ, నాయకులు చలమల్ల నర్సింహారెడ్డి, నన్నూరి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మోటకొండూర్: పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రావడం లేదని ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం మోటకొండూర్ మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో జరిగింది. ఎస్‌ఐ తేజంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తిరెడ్డిగూడేనికి చెందిన గుర్రాల సోములు(40), అతడి భార్య సుజాత మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సుజాత నెల క్రితం తన కుమార్తె, కుమారుడిని భర్త వద్ద వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపంతో సోములు గురువారం తన వ్యవసాయ క్షేత్రం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్క పొలాల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి గుర్రాల సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓర్వలేకనే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

- శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు, దళితబంధు పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఓర్వలేక.. వాటిని నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుత్తా మాట్లాడారు. ఇప్పటి వరకు 10 దఫాలుగా రైతుబంధు ద్వారా పెట్టుబడి కోసం ప్రభుత్వం రూ.73 వేల కోట్లు రైతులకు ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఠాక్రే, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఎన్నికల సమయంలో రైతుబంధు ఆపాలని ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులకు వ్యవసాయం అంటే ఏమిటో, రైతుల కష్టాలు ఏమిటో తెలియదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా తెలంగాణలో దళితుల కోసం దళిత బంధు ద్వారా రూ.10 లక్షలు ఇస్తుంటే దీనిని కూడా నిలిపివేయాలని కాంగ్రెస్ నాయకులు కోరడం సబబుకాదన్నారు. కాంగ్రెస్ పార్టీ, దళిత, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే నెలకో ముఖ్యమంత్రి వస్తాడని, ఇంత మందిని భరించే శక్తి ప్రజలకు లేదన్నారు. రాష్ట్రానికి కేసీఆర్ శ్రీరామ రక్ష అని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు తగిన బుద్ధిచెప్పాలని కోరారు. రాష్ట్రం కోసం, ప్రజల సంక్షేమం కోసం ఆలోచించే కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

జీవితంపై విరక్తితో బలవన్మరణం

- గడ్డి మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

మోత్కూరు: జీవితంపై విరక్తితో మద్యం మత్తులో గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. వివరాలు.. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన బండారు కిష్టయ్య, భద్రమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. చిన్న కుమారుడు ఉప్పలయ్య(45)కు మూడు పెళ్లిళ్లు కాగా ముగ్గురు భార్యలతో విడాకులు తీసుకున్నాడు. కాగా సోమవారం దసరా పండుగ రోజు మద్యం తాగిన ఉప్పలయ్య జీవితంపై విరక్తితో అదే రోజు రాత్రి ఇంట్లో ఉన్న గడ్డి మందు కూడా తాగాడు. మరుసటి రోజు నుంచి ఉప్పలయ్య వాంతులు చేసుకుంటుండటంతో బుధవారం తల్లిదండ్రులు 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కాగా కిష్టయ్య, భద్రమ్మ దంపతుల పెద్ద కుమారుడు గతంలో పాముకాటుతో చనిపోగా, కుమార్తె అనారోగ్యంతో మృతిచెందింది. ఇప్పుడు చిన్నకుమారుడు ఉప్పలయ్య కూడా ఆత్మహత్య చేసుకోవడంతో ఆ వృద్ధ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి తండ్రి బండారు కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.